## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

కుటుకనూర్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అయిజ, సెప్టెంబర్ 14: మండలంలోని కుటుకనూర్, ఉత్తనూర్, కొత్తపల్లిలో మృతుల కుటుంబాలను అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పరామర్శించారు. శనివారం అయిజ మండలంలోని కుటుకనూర్‌లో పెద్ద భీమన్న (45) మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బీఆర్ఎస్ నాయకులతో కలిసి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. అలాగే ఉత్తనూర్‌లో ఎర్రన్న, కొత్తపల్లిలో సుమిత్రమ్మ పార్థివదేహాలపై పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి లక్ష్మారెడ్డికి పరామర్శ

మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని పరామర్శిస్తున్న బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు

అయిజ, సెప్టెంబర్ 14: మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ రాష్ట్ర నేత లక్ష్మారెడ్డిని బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు కురువ పల్లయ్య పరామర్శించారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా, తిమ్మాజిపేట మండలం, ఆవంచలో లక్ష్మారెడ్డి స్వగృహానికి చేరుకుని ఆయన సతీమణి చిత్రపటానికి నివాళులర్పించారు. ఇటీవల మాజీ మంత్రి సతీమణి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని మాజీ మంత్రిని పరామర్శించినట్లు పల్లయ్య తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు మోహన్‌బాబు, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

## కామ్రేడ్ లక్ష్మీదేవమ్మకు ఘన నివాళి

లక్ష్మీదేవమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా నేతలు

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 14: ఉద్యమ నాయకురాలు, ఐద్వా ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘ కాలం పనిచేసిన కామ్రేడ్ ఎస్ఎస్ లక్ష్మీదేవమ్మ మృతి చెందడంపై శనివారం జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ నగర్ కాలనీలో ఐద్వా సంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మి, సీనియర్ నాయకురాలు సుగుణమ్మ మాట్లాడుతూ.. కామ్రేడ్ లక్ష్మీదేవమ్మ మృతి ఉద్యమాలకు తీరని లోటన్నారు. ఆమె మృతి చాలా బాధాకరమన్నారు. ఐద్వాలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘ కాలం పనిచేశారని, సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజల శ్రేయస్సు కోసం కష్టపడి పనిచేశారన్నారు. వనపర్తిలోని పుట్టిపెరిగి, చిన్ననాటి నుంచి విప్లవ సిద్ధాంతాలతో నడిచిన వ్యక్తి లక్ష్మీదేవమ్మ అని అన్నారు. 1987లో మహబూబ్‌నగర్ జిల్లా కరువు కాటకాలతో విలవిలలాడుతున్న సమయంలో 16 అంబలి కేంద్రాలను పెట్టి పేదల ఆకలి తీర్చారని కొనియాడారు. లక్ష్మీదేవమ్మ ఆదర్శాలను ముందుకు తీసుకొని పోవాలని ఐద్వా కార్యకర్తలుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సాయిలీల, సహాయ కార్యదర్శి ఉమా, రేణుక, సుగుణమ్మ, వసంత, శివమ్మ, సావిత్రి, లక్ష్మి, కాంతమ్మ, జ్యోతి, జయమ్మ, స్వాతి తదితరులు ఉన్నారు.

## బీమా కంపెనీ మేనేజర్‌కు కారు డ్రైవర్ బురిడీ

- సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌తో పరారీ
- ముచ్చోనిపల్లి శివారులో ఘటన, పోలీసులకు ఫిర్యాదు

గట్టు, సెప్టెంబర్ 14: కారు ఎక్కించుకొని బురిడి కొట్టించి ఏకంగా ఓ వ్యక్తి సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ను తీసుకొని పరారైన ఘటన మండలంలోని ముచ్చోనిపల్లి శివారులో శనివారం చేటుచేసుకున్నది. ఎస్సై కేటీ మల్లేశ్ కథనం ప్రకారం.. మాచర్లకు చెందిన పేట గౌడ నారాయణ హైదరాబాద్‌లో కొటక్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీకి డిప్యూటీ మేనేజగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. సెలవుల నిమిత్తం హైదరాబాద్ నుంచి మాచర్లకు వెళ్లడానికి అయిజకు బయలుదేరాడు. అయిజ నుంచి మాచర్లకు వెళ్లడానికి తెలంగాణ చౌరస్తాలో ఆగాడు. ఈ సమయంలో ఓ స్విఫ్ట్ డిజైర్ కారు అక్కడికి వచ్చింది. అటువైపుగా వెళ్తున్నానని చెప్పి కారు డ్రైవర్ నారాయణను ఎక్కించుకున్నాడు. మార్గమధ్యంలో వాహనం ముచ్చోనిపల్లి డ్యాం వైపుగా వెళ్లాడు. దీంతో అనుమానం వచ్చిన నారాయణ అటువైపు ఎందుకు వెళ్తున్నావని ప్రశ్నించాడు. కొంచెం పని ఉందని చెప్పిన డ్రైవర్ ఓ రూం వద్ద ఆపి తన ఫోన్ రీచార్జ్ అయిపోతోందని చెప్పి నారాయణను నమ్మబలికించి అతడి ఫోన్‌ను కొంత దూరానికి తీసుకుని ఫోన్ మాట్లాడే ప్రయత్నం చేశాడు. నారాయణ మూత్ర విసర్జనకు వెళ్లగా.. అదను చూసిన కారు డ్రైవర్ నారాయణ సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌తో అక్కడి నుంచి కారులో పరారయ్యాడు. వీటి విలువ రూ.62వేల వరకు ఉంటుందని బాధితుడు చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## భార్యాభర్తల మధ్య గొడవ

- క్షణికావేశంలో పురుగుల మందుతాగి భర్త ఆత్మహత్య

గట్టు, సెప్టెంబర్ 14: అప్పటిదాకా కుటుంబ సభ్యులంతా ఆనందంగా గడిపారు. అనంతరం పొలానికి వెళ్లారు. సీడ్ పత్తి క్రాసింగ్‌కు ఉపక్రమించారు. అంతలోనే భార్యాభర్తలు ఓ విషయంలో గొడవపడ్డారు. క్షణికావేశంలో మనస్తాపానికి గురైన భర్త పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటన మండలంలోని రాయాపురంలో శనివారం చేసుకున్నది. పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్న గోకారన్న(30)ను కుటుంబ సభ్యులు గద్వాల ఏరియా దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కేటీ మల్లేశ్ తెలిపారు.

# శోభాయాత్రలో డీజేలు పెట్టొద్దు

- జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు
- పోలీసుల సూచనలు పాటించాలి
- వనపర్తి సీఐ నాగభూషణ్‌రావు

చోరీ వివరాలను వెల్లడిస్తున్న సీఐ నాగభూషణ్ రావు

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 14: వనపర్తి జిల్లావ్యాప్తంగా పోలీస్ యాక్ట్ అమలులో ఉందని, డీజేలకు అనుమతి లేదని సీఐ నాగభూషణ్‌రావు వెల్లడించారు. శుక్రవారం సీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వినాయక ప్రతిమలను భక్తిశ్రద్ధలు, నియమ, నిబంధనలతో నిమజ్జనానికి తరలించాలని పేర్కొన్నారు. ఇతర మతాల ప్రార్థన మందిరాల వద్ద ఆపి అంతరాయం కలిగించరాదని, రోడ్లపై వెళ్లే బాటసారులపై రంగులు, నీళ్లు, ఇతర వస్తువులు చల్లరాదని, విగ్రహాన్ని గంటల తరపడి ఒకే ప్రదేశంలో ఉంచి చిందులు వేస్తూ ఆటంకం కలిగించొద్దని సూచించారు. శోభాయాత్రలో పటాకులు కాల్చరాదని, నిమజ్జన స్థలానికి చిన్నపిల్లలు, ఈత రానివారిని తీసుకెళ్లొద్దని, చెరువులు, కుంటల వద్దకు ఈత వచ్చిన వారు, నిర్వాహకులు మాత్రమే రావాలని తెలిపారు. ఊరేగింపులో వాహనం నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనాన్ని విడిచి వెళ్లొద్దని, మద్యం తాగి వాహనం నడిపేందుకు అనుమతించొద్దని, ఊరేగింపులో కొత్త వ్యక్తులు కనబడితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పోలీస్ అధికారుల సూచనలు పాటించాలన్నారు. వినాయక విగ్రహం వద్ద తగిన నిబంధనలు పాటిస్తూ భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా నిమజ్జనం చేయాలన్నారు.

**దొంగ పట్టివేత: నగదు రికవరీ**

వనపర్తి జిల్లాలోని రేవల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రూ.43,500 రికవరీ చేసినట్లు సీఐ నాగభూషణ్‌రావు చెప్పారు. శుక్రవారం సీఐ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈనెల 10న కొంకలపల్లిలో బోయ వెంకటేశ్ ఇంటికి తాళం వేసి చారకొండ మల్లన్న ఆలయానికి వెళ్లాడు. అదేరోజు అర్ధరాత్రి దొంగతనానికి పాల్పడి బీరువాలను విరుగగొట్టి రూ.30వేల నగదును తస్కరించినట్లు సీఐ తెలిపారు. కొంకలపల్లి బస్టాండ్, బండరాయిపాకుల బస్టాండ్‌లో సీసీ కెమెరాలను పరిశీలిస్తే మల్లేశ్ అనే కొత్త వ్యక్తి అనుమానాస్పదంగా కనబడ్డాడు. అదేవిధంగా శాయినీపల్లిలో అర్ధరాత్రి రూ.80వేలు ఎత్తుకెళ్లినట్లు సీఐ చెప్పారు. అనుమానితుడు 2019లో రంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో బంగారం దొంగతనం చేసి విక్రయించగా.. నేరస్తుడిని పట్టుకొని నేరం రుజువు కావడంతో జైలు జీవితం కూడా గడిపాడని చెప్పారు. మల్లేశ్ వద్ద తులం బంగారు, వెండి అభరణాలు దొరికినప్పటికీ విసిరేసి నగదు మాత్రమే దొంగిలించాడని, ఈ రెండు కేసుల్లో నేరస్తుడిని విచారించగా దొంగతనం ఒప్పుకున్నాడని తెలిపారు. మొత్తం రూ.43,500 రికవరీ చేశామన్నారు. కేసు ఛేదించడంలో కృషి చేసిన రేవల్లి ఎస్సై రాము, కానిస్టేబుళ్లు అంజి, బలరాంను సీఐ అభినందించారు. సమావేశంలో వనపర్తి ఎస్సై జయన్న ఉన్నారు.

## రేపటి ప్రజావాణి బంద్

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 14: ఈనెల 16వ తేదీన మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించినందున ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడదని కలెక్టర్ సంతోష్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు విషయాన్ని గమనించి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి ఇబ్బందికి గురికావద్దని పేర్కొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 14: తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మైనార్టీ అభ్యర్థులకు శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రమేశ్‌బాబు శనివారం ప్రకటనలో తెలిపారు. మైనార్టీలకు వివిధ రంగాల్లో శిక్షణ, ఉద్యోగం కల్పించే వృత్తి శిక్షణ సంస్థలను ట్రైనింగ్ పార్ట్‌నర్లుగా నియమించుటకు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 4వ తేదీలోగా ధ్రువపత్రాలను అందజేయాలని, పూర్తి వివరాలకు 7013032567 కాల్ చేసి సంప్రదించాలని సూచించారు.

## పెబ్బేరులో కానిస్టేబుల్ సస్పెన్షన్

వనపర్తి టౌన్/పెబ్బేరు, సెప్టెంబర్ 14: పెబ్బేరు పోలీస్ స్టేషన్‌లో విధుల నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్ పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు ఎస్పీ రావుల గిరిధర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల విధుల్లో అలసత్వం వహించినందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. పెబ్బేరులో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రాజేంద్రప్రసాద్‌ను ఎస్పీ సూచన మేరకు విధుల్లో భాగంగా వనపర్తి పట్టణానికి ట్రాఫిక్ డ్యూటీకి వెళ్లాల్సిందిగా ఎస్సై హరిప్రసాదరెడ్డి ఆదేశించారు. తాను ఆ డ్యూటీకి వెళ్లనని ఎస్సైతో గొడవ పెట్టుకొని ఎస్సై వ్యక్తిగత ల్యాప్‌ట్యాప్‌ను పగులగొట్టాడు. ఈ విషయాన్ని ఎస్సై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా కొత్తకోట సీఐ ఈ వ్యవహారంపై విచారణ జరిపి నివేదిక పంపారు. ఈ నేథ్యంలో కానిస్టేబుల్‌ను సస్పెన్షన్ చేస్తున్నట్లు ఎస్పీ కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది.

## రాఘవేంద్రస్వామి మఠాధికారిగా మల్దకల్ అర్చకుడు మధుసూదనాచారి

మల్దకల్, సెప్టెంబర్ 14: రాఘవేంద్ర స్వామి మఠాధికారిగా మల్దకల్ క్షేత్రం లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ అర్చకుడు మధుసూదనాచారి నియమితులయ్యారు. గద్వాల రీజియన్, మల్దకల్, అయిజ, ధరూరు మండలాల్లోని రాఘవేంద్ర స్వామి మఠాలకు సంబంధించి మఠాధికారిగా మధుసూదనాచారిని నియమిస్తూ శుక్రవారం మంత్రాలయ పీఠాధిపతులు సబుదేంద్ర తీర్థ కరకమలాలతో నియామకపత్రం అందజేసినట్లు తెలిపారు.

## కూలిన ఇల్లు: తప్పిన ప్రమాదం

కొత్తకోట,సెప్టెంబరు14: పట్టణంలోని 14వ వార్డులో శుక్రవారం అర్ధరాత్రి రిక్షా కార్మికుడి ఇల్లు కూలింది. ఆ సమయంలో కుటుంబం బయటికి రావడంతో ప్రమాదం నుంచి బయట పడింది . విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేశిని, మాజీ జెడ్పీటీసీ విశ్వేశ్వర్ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని తాసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పరామర్శించిన వారిలో వైస్ చైర్‌పర్సన్ జయమ్మ, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు బీమాప్రసన్న లక్ష్మి, కౌన్సిలర్ ఖాజామైనుద్దీన్, సంధ్యారవీందర్‌రెడ్డి, వికాస్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

వర్షానికి కూలిన రిక్షా కార్మికుడు ఇల్లు

## అంబేద్కర్ జీవితం యువతకు ఆదర్శం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి

పెబ్బేరు, సెప్టెంబర్ 14: భారతరత్న, బడుగుబలహీనుల ఆశాదీపం అంబేద్కర్ నేటి యువతకు ఆదర్శమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి అన్నారు. శనివారం పెబ్బేరు మండలం కంచిరావుపల్లిలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంబేద్కర్ ప్రపంచానికి దిక్సూచిగా నిలిచారని, స్వాతంత్ర్య ఉద్యమం, దేశ పునర్నిర్మాణానికి ఆయన చేసిన సేవలు మరవలేనివన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణలో పాల్గొన్న చిన్నారెడ్డి

**అవార్డు గ్రహీతకు సన్మానం**

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 14: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న పలుస శంకర్‌గౌడ్‌ను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి శనివారం ఆయన నివాసంలో శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ.. 35 ఏండ్లుగా విద్యాశాఖకు ఎన్నో సేవలు అందించారని, సమాజసేవలో శంకర్‌గౌడ్ ముందుండడాన్ని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్, కాంగ్రెస్ మాజీ ప్రజాప్రతినిధులు రాములుయాదవ్, అశోక్‌రెడ్డి, ఎల్ల స్వామి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, భాస్కర్, రాములు తదితరులు ఉన్నారు.

## పదోపటాలంలో ఉత్సాహంగా స్పోర్ట్స్ మీట్

ఎర్రవల్లి చౌరస్తా, సెప్టెంబర్ 14: ఎర్రవల్లి చౌరస్తాలోని పదో పటాలంలో శనివారం అదనపు కమాండెంట్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బెటాలియన్ స్పోర్ట్స్ మీట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ స్పోర్ట్స్‌మీట్‌ను ప్రారంభించి మాట్లాడారు. మొత్తం ట్రైనీ కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారని తెలిపారు. అదేవిధంగా స్పోర్ట్స్‌మీట్‌తో పదోపటాలంలో పండుగ వాతావరణం నెలకొందని, క్రీడలు మనిషికి మానసిక ఆనందాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. ఆటలు ఆడటంతో ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా జీవిస్తారని తెలియజేశారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐలు రాజారావు, వెంకటేశ్వర్లు, సయ్యద్ బాషా, సుధీర్, శ్రీశైలం, సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న అదనపుకమాండెంట్

**కబడ్డీ పోటీలు ప్రారంభం**

గద్వాల రూరల్, సెప్టెంబర్ 14: మండలంలోని వీరాపురం వద్ద ఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం నుంచి ఈనెల 17 వరకు నిర్వహించనున్నట్లు సీబీఎస్ఈ సౌత్‌జోన్ బాలుర కబడ్డీ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ కబడ్డీ పోటీలను స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ జితేందర్, పాఠశాల డైరెక్టర్ రాముడు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ పోటీల్లో 46 పాఠశాలకు చెందిన 15 అండర్-19 జట్లు, 21 అండర్-17జట్లు, 24 అండర్-14జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఎస్జీఎఫ్ సెక్రటరీ జితేందర్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడుతాయన్నారు. ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా స్వీకరించి తమ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల క్రీడాకారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణపై తీర్పును సుప్రీం కోర్టు వెనక్కి తీసుకోవాలి

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 14: సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును వెనక్కి తీసుకొని దేశంలోని రాష్ట్రాలకు సూచనలు చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా నాయకులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జైభీమ్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో ఎస్సీ వర్గీకరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను గతంలో టీడీపీ ప్రభుత్వం తీసుకురాగా హైకోర్టు దానిని కొట్టి వేసిందని గుర్తుచేశారు. ఎస్సీలను విభజించాలనే కుట్రలతో సుప్రీం కోర్టుకు తప్పుడు నివేదికలు ఇచ్చి ఎస్సీ వర్గీకరణ చేసుకునే విధంగా తీర్పు ఇప్పించారన్నారు. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని మాల, మాదిగల కులాల్లో చిచ్చు పెట్టొద్దన్నారు. అదేవిధంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మాలమహానాడు ఆధ్వర్యంలో బహిరంగ సభ ఉంటుందని, అందుకు అన్ని మండలాల్లో కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మోజర్ల కృష్ణ, నిరంజనయ్య, కురుమూర్తి, రంజిత్‌కుమార్, దశరథం, వెంకటస్వామి, మండలాల మాల మహానాడు నేతలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నేతలు

## కిశోర బాలికల సంఘ సభ్యులకు శిక్షణ

వడ్డేపల్లి, సెప్టెంబర్ 14: మండల కేంద్రంలోని శాంతినగర్‌లో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి కిశోర బాలికల సంఘ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంవీ ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్ భాస్కర్‌గౌడ్ పాల్గొని బాలికలపై సమాజంలో ఉన్న అభిప్రాయాలు, జెండర్ ఇక్వాలిటీ, బాలికల ఉన్నత చదువు, బాల్యవివాహాల నిర్మూలన, కిశోర బాలిక సంఘాల బలోపేతం తదితర విషయాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం రెండు మండలాలకు తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య (టీఏఎస్ఎస్) కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సీసీలు తిమ్మప్ప, బుచ్చన్న, ఎంవీ ఫౌండేషన్ హనిమిరెడ్డి, రజిత తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకేతం చూపిస్తున్న కిశోర బాలికల సంఘ సభ్యులు

## పోలోని వాగుపై వంతెన నిర్మాణం పూర్తి చేయాలి

- అఖిలపక్ష నాయకుల డిమాండ్
- తెగిన తాత్కాలిక వంతెనపై నిరసన

అయిజ, సెప్టెంబర్ 14: పట్టణానికి సమీపంలోని పోలోని వాగుపై వంతెన నిర్మాణం సత్వరమే పూర్తి చేయాలని అయిజ అఖిలపక్ష కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పోలోని వాగుపై వరద ధాటికి తెగిన తాత్కాలికంగా పైప్‌లతో నిర్మించిన వంతెనపై అఖిలపక్ష కమిటీ నిరసన తెలిపారు. పది రోజుల కిందట కురిసిన భారీ వర్షాలకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వంతెన తెగిపోవడంతో రెండు రాష్ట్రాల ప్రజలు ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అయిజ నుంచి మండలంలోని తుపత్రాల, మేడికొండ, పులికల్, కిసాన్‌నగర్, పులికల్, రాజాపురం, బైనపల్లి, కొత్తపల్లితోపాటు కర్నూల్ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం, ఎమ్మిగనూర్, ఆదోనితోపాటు కర్ణాటకలోని బళ్లారి తదితర ప్రాంతాలకు ఈ రోడ్డు మీదుగా ప్రయాణించాల్సి ఉందన్నారు. తాత్కాలిక వంతెన పూర్తిగా కొట్టుకుపోవడంతో రాకపోకలు సాగించేందుకు మరో ఐదు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోందని, దీంతో సమయం అదనం కావడంతోపాటు కొత్తగా వాహనాల్లో వచ్చే ప్రయాణికులు తికమక పడుతున్నారని వాపోయారు. వర్షాలు తగ్గినా తాత్కాలికంగా నిర్మించిన వంతెనపై మట్టి వేసి రాకపోకలు సాగించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే శాశ్వత వంతెన పనులు ముమ్మరం చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తాత్కాలిక వంతెన, పులికల్ వరకు బీటీ రోడ్డు పనులు వేగిరంగా పూర్తి చేసిన అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పూర్తి చేయని పక్షంలో ఆయా గ్రామాల ప్రజలతో కలిసి ప్రజాక్షేత్రంలో ప్రజాప్రతినిధులు, అధికారులను నిలదీస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ నాయకులు ఆంజనేయులు, తిరుమల్‌రెడ్డి, సుధాకర్ గౌడ్, ఆంజనేయులు, విజయ్‌భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వాగుపై నిరసన తెలుపుతున్న అఖిలపక్ష కమిటీ నాయకులు

## సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- డీఎస్పీ వెంకటేశ్వరరావు

సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

చిన్నంబావి, సెప్టెంబర్ 14: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని డీఎస్పీ వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని బెక్కెంలో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమనే విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ప్రస్తుత సమాజంలో దొంగతనాలు, దాడులు పెరిగిపోయాయని, వాటిని నియంత్రించడంతోపాటు నిందితులను గుర్తించి పట్టుకోవడంలో సీసీ కెమెరాలు ప్రధాన పాత్రను పోసిస్తాయన్నారు. గ్రామస్తులను చైతన్యం చేసి సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేసిన ఎస్సై పబ్బతి రమేశ్‌ను అభినందించారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ప్రస్తుతం దొంగలు టెక్నాలజీని వాడుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైన ఫోన్ చేసి వివరాలు అడిగితే సమాచారం ఇవ్వొద్దని చెప్పారు. గ్రామాల్లో ప్రజలు కలిసికట్టుగా ఉండి గ్రామాభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో రైతు కమిటీ అధ్యక్షుడు హనుమంతు, సభ్యులు బాలకిష్టయ్య, కాంతయ్య, రబ్జా, కాంగ్రెస్ నాయకులు కృష్ణ, ఈదన్నయాదవ్, రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గోమాతకు అంతిమ వీడ్కోలు

గోమాతకు అంతిమ వీడ్కోలు పలుకుతున్న యజమాని

మానవపాడు, సెప్టెంబర్ 14: గోమాతకు హిందూ సంప్రదాయ పద్ధతిలో అంతిమ వీడ్కోలు పలికి అంత్యక్రియలు నిర్వహించిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. మండల కేంద్రంలో శివాలయానికి కానుకగా.. భక్తులు ఏడేండ్ల కిందట ఆవు దూడను వదిలారు. ఆర్నెళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ.. శనివారం తెల్లవారుజామున మృతిచెందింది. దీంతో గ్రామస్తులు హిందూ సంప్రదాయ బద్ధంగా మేళతాళాలతో శ్మశానం వరకు అంతిమ వీడ్కోలు పలికి అంత్యక్రియలు నిర్వహించారు. గోమాతకు దశదిశకర్మ నిర్వహించి బంధుమిత్రులకు భోజనాలు ఏర్పాటు చేస్తామని గోమాత యజమాని యోగేశ్వర్ తెలిపారు.

## వీపనగండ్ల ఎస్సైగా రాణి

వీపనగండ్ల, సెప్టెంబర్ 14: వీపనగండ్ల పోలీస్‌స్టేషన్ ఎస్సైగా రాణి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతలను కాపాడేవిధంగా మండల ప్రజలతో మమేకమై నిబంధనల మేరకు కృషి చేస్తామన్నారు. అందులో భాగంగా వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామీణ యువతీ యువకులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు సహకరించాలని కోరారు. ఇదివరకున్న ఎస్సై నందికర్ బదిలీపై వెళ్లారు.

## ఖ